క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

కేతేపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

చంద్ర రాజేశ్వర్‌రావుకు ఘన నివాళి

నల్లగొండ టౌన్ : పేదలకు భూమి దక్కాలని పోరాటం చేసిన చంద్ర రాజేశ్వర్‌రావు ఆశయాలను కొనసాగించడానికి అందరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో రాజేశ్వర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పబ్బు వీరస్వామి, లెనిన్, ముత్యాలు, సుజాత, మదార్, యూసుఫ్ పాల్గొన్నారు.

వీల్ చైర్ బహూకరణ



వీల్ చైర్ అందజేస్తున్న సైదులు

చిట్యాల: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల సౌకర్యార్థం రోటరీ న్యూక్లబ్ డెవలప్‌మెంట్ జోనల్ చైర్మన్ ఎంపల్ల బుచ్చిరెడ్డి సమకూర్చిన వీల్ చైర్‌ను గురువారం వైద్యాధికారి అజార్ అహ్మద్‌కు చిట్యాల పట్టణ రోటరీ క్లబ్ చైర్మన్ గుండెబోయిన సైదులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎడ్ల శ్రీశైలం, కంభంపాటి నర్సింహ, గాలి యాదగిరి, ఏనుగు రవీందర్‌రెడ్డి, గుండెబోయిన శివసాయి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నకిరేకల్‌లో అన్నదానం



అన్నదానం చేస్తున్న పద్మాకృష్ణమూర్తి

నకిరేకల్ : అమావాస్య సందర్భంగా నకిరేకల్‌లోని వాసవి వనితా క్లబ్ ఫౌండర్ చైర్మన్ బ్రహ్మదేవర పద్మాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో గురువారం 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో అన్నదాత చందా జయమ్మ, క్లబ్ రీజియన్ చైర్మన్ దేవరశెట్టి సత్యనారాయణ, క్లబ్ ప్రతినిధులు కందగట్ల భవాని, శరవిరాల శ్రీలత, గర్రె రూపశ్రీ, బ్రహ్మదేవర శోభ, కందగట్ల పుష్పలత, రేపాల దయాకర్, అలేఖ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో..

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని గురువారం ఆ క్లబ్‌ల డిస్ట్రిక్ పీఆర్‌ఓ రాయపూడి భవాని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సేవ చేయడంలోనే ఎంతో తృప్తి ఉందన్నారు. క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ వీరవెల్లి పద్మావతి, జోన్ చైర్మన్ రమాదేవి, డిస్ట్రిక్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తిరునగరు పద్మావతి, భువనగిరి లావణ్య, కొండూరు ఇందిరా, గుండా లక్ష్మి, వీరవెల్లి శ్రీదేవి, జైని సుశ్మిత, పద్మావతి, ఓరుగంటి జ్యోతి, మంచుకంటి శ్రీ దేవి, రేపాల శ్రీనివాస్, జనార్దన్, మారం పద్మ శ్రీనివాస్, శివ నాగజ్యోతి, శరత్ పాల్గొన్నారు.

కోటి ఆశలతో సాగుకు సమాయత్తం

- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- తొలకరి వర్షాలతో రైతుల హర్షం



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు



పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

నకిరేకల్ : ఈ ఏడాది వానాకాలంలో మృగశిర కార్తెకు ముందు సకాలంలో రుతుపవనాలు రావడంతో రైతుల ముఖాల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. ఐదు రోజుల క్రితం, అదేవిధంగా బుధవారం రాత్రి కురిసిన వర్షాలతో నకిరేకల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో రైతులు దుక్కులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. కొంతమంది రైతులు పత్తి విత్తనాలు విత్తుతున్నారు. ఈపాటికే అక్కడక్కడ రైతులు నారుమళ్లు పోసే పనుల్లో ఉన్నారు. ఈ ఏడాదైనా పుష్కలంగా వర్షాలు కురిస్తే వాణిజ్య పంటలతోపాటు వరి సాగును అధికంగా చేసేందుకు రైతాంగం సన్నద్ధమవుతోంది. మరోసారి వర్షం అనుకూలంగా కురిస్తే రైతులు పూర్తిస్థాయిలో వ్యవసాయ పనుల్లో బిజీబిజీ అవుతారు. నకిరేకల్ వ్యవసాయ డివిజన్ వ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో 1,15,957 ఎకరాల్లో వరి, 90,032 ఎకరాల్లో పత్తి, ఇతర పంటలు కంది, పెసర, వేరుశనగ మొత్తం 3820 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ప్రధానంగా వరి సాగు గణనీయం పెరగనుంది. పత్తి సాగు క్రమంగా తగ్గుతోంది. వరి పంట వైపే రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

వానాకాలం సీజన్ ప్రారంభం కాగానే ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచింది. వరి వివిధ రకాల పత్తి విత్తనాల ప్యాకెట్లను వ్యవసాయాధికారులు ఆయా మండల కేంద్రాల్లోని పీఏసీఎస్ కేంద్రాల్లో, ఫర్టిలైజర్ దుకాణాల్లో అందుబాటులో ఉంచారు. రాయితీపై ఇచ్చే వరి, కంది, జీలుగు విత్తనాలు కూడా సిద్ధంగా ఉన్నాయి. వీటితోపాటు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు, యూరియా రెడీగా ఉన్నాయి ఎపచ్చిరొట్ట, జనుము, జీలుగు విత్తనాలు రైతులకు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. జీలుగ 30 కేజీల బ్యాగ్ రూ1116, జనుము 40 కేజీల బ్యాగ్ రూ.1448 ధర నిర్ణయించారు..

నకిరేకల్ వ్యవసాయ డివిజన్‌లో వానాకాలంలో సాగయ్యే పంటల విస్తీర్ణం (ఎకరాల్లో)

మండలం	వరి	పత్తి	ఇతర పంటలు
నకిరేకల్	18,500	6200	300
కేతేపల్లి	16,000	6000	550
కట్టంగూర్	24,457	8832	1200
నార్కట్‌పల్లి	22,000	24,000	450
చిట్యాల	16,000	22,000	120
శాలిగౌరారం	19,000	23,000	1200
మొత్తం	1,15,957	90,032	3820

పది ఎకరాల్లో పత్తి వేస్తున్నా



ఓ మోస్తరు వర్షం పడడంతో పత్తి విత్తనాలను విత్తుతున్నాం. మృగశిర కార్తె శనివారం నుంచి ప్రారంభ కాబోతుంది. ఈ మృగశిర కార్తెలో విత్తనాలు విత్తితే బాగా పంటలు పండుతాయని నమ్మకం. ఈ వానాకాలం సీజన్‌లో 10 ఎకరాల్లో పత్తి విత్తనాలు వేస్తున్నా. ఈ ఏడాదైనా వర్షాలు బాగా కురవాలని వరుణ దేవున్ని ప్రార్థిస్తున్నాం.

–దండెంపల్లి యాదయ్య, రైతు, మసిబాయిగూడెం, కట్టంగూరు

మరోసారి వర్షం వస్తే అనుకూలం



ప్రస్తుతం వానకాలం సీజన్ ప్రారంభమైంది. ఈపాటికే రైతులు సబ్సిడీ విత్తనాలు తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలతో అక్కడక్కడ పత్తి విత్తనాలు వేస్తున్నారు. ఈ వర్షాలతో భూమి పదునెక్కింది. మరోసారి వర్షాలు కురిస్తే అన్ని విత్తనాలు విత్తేందుకు అనుకూలంగా ఉంటుంది. రైతులకు అందుబాటులో విత్తనాలు ఉన్నాయి.

–జానిమీయా, ఏఓ, నకిరేకల్

స్కాలర్ షిప్ అందజేత

చౌటుప్పల్ : ఎస్‌బీఐ ఇటీవల నిర్వహించిన స్కాలర్‌షిప్ అర్హత పరీక్షలో చౌటుప్పల్‌లోని తెలంగాణ బాలికల గురుకులానికి చెందిన 2023–24విద్యా సంవత్సరం పదవ తరగతి విద్యార్థిని బొమ్మిరెడ్డి హర్షితారెడ్డి టాపర్‌గా నిలిచింది. గురువారం విద్యార్థిని ఖాతాలో స్కాలర్‌షిప్ రూ.20వేలను జమ చేశారు. విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ సరోజమ్మ అభినందించారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీని పూర్తి స్థాయిలో అరికట్టాలని తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ కోరారు. గురువారం స్థానికంగా నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను వసూలు చేస్తున్నప్పటికీ విద్యాశాఖాధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. పట్టణంలోని కార్పొరేట్ విద్యా సంస్థలు విచ్చలవిడిగా ఎల్‌కేజీ విద్యార్థికి రూ.45 వేల నుంచి 70 వేల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు ఎర్రబెల్లి గంగాధర్, కోటేష్, లోకేష్, నవీన్, రాం మోహన్ తదితరులున్నారు.

పుస్తకాలు సకాలంలో అందేనా !



మునుగోడు ఎమ్మార్సీలో ఉన్న పాఠ్య పుస్తకాలు

మునుగోడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలతోపాటు నోట్ పుస్తకాలను అందిస్తోంది. గతంలో పాఠశాలలు ప్రారంభమైన 15 రోజుల నుంచి నెల రోజులలోపు విద్యార్థులకు పుస్తకాలను అందించేవారు. కానీ నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభం కాకముందే విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలతోపాటు అదనంగా నోట్ పుస్తకాలు అందించేలా ఏర్పాటు చేసింది. అనుకున్నట్లే నెలరోజుల క్రితమే మండలంలోని విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు సరఫరా చేసింది. కానీ విద్యార్థులకు సరిపడా సరఫరా చేయలేదు. మునుగోడు మండలంలో మొత్తం 42 పాఠశాలలు ఉండగా అందులో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు 2602 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 13,057 పాఠ్య పుస్తకాలు అవసరం ఉండగా ఇప్పటి వరకు ప్రభుత్వం 12,555 పాఠ్య పుస్తకాలను సరఫరా చేశారు. ఇంకా 502 పుస్తకాలు రావాల్సి ఉంది. అదేవిధంగా 14,588 నోట్ పుస్తకాలు సరఫరా చేయాల్సి ఉండగా 9,686 సరఫరా చేశారు. ఇంకా 4902 సరఫరా చేయాల్సి ఉంది. మరో ఆరు రోజుల్లో పాఠశాలు ప్రారంభం కానుండడంతో వచ్చిన కొద్దిపాటి పుస్తకాలు విద్యార్థులకు ఎలా ఇవ్వాలో అర్థం కావడం లేదని పలువురు పాఠశాలల ఉపాధ్యాయులు వాపోతున్నారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలు ప్రారంభించక ముందే మునుగోడు మండలానికి పూర్తిస్థాయిలో పుస్తకాలు సరఫరా చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



నకిరేకల్ : ప్రతిభ చూపిన విద్యార్థులతో అసోసియేషన్ ప్రతినిధులు

నకిరేకల్ : జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో నకిరేకల్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన బెల్ట్ ఎగ్జామ్‌లో స్థానిక ఎస్‌ఆర్ విజ్ఞాన కేంద్రంలో శిక్షణ పొందిన కరాటే జోడో విద్యార్థులు ప్రతిభ చూపారు. బ్లాక్ బెల్ట్ విభాగంలో ఎం.సత్యరాజ్, రేఖ, శివకేశవ్, భవ్య, కలర్ బెల్ట్ విభాగంలో చరణ్, జస్వంత్, నిక్షత, కృతిక, బిందు, అభి ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో అసోసియేషన్ చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్, ఎస్‌ఆర్ కేంద్రం ప్రతినిధులు కందాల ప్రమీల, యానాల కృష్ణారెడ్డి, ప్రకాష్‌రావు, కరాటే మాస్టర్ అంతటి సోములుగౌడ్ పాల్గొన్నారు.

కట్టంగూర్ : జపాన్ కరాటే అసోషియేషన్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం నకిరేకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బెల్ట్ ఎగ్జామ్ కరాటే పోటీల్లో కట్టంగూర్ కరాటే జోడో విద్యార్థులు ప్రతిభ చాటారు. తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్ సమక్షంలో నిర్వహించిన ఈ పోటీల్లో గ్రీన్ బెల్ట్ విభాగంలో కట్టంగూర్‌కు చెందిన చెరుకు రక్షిత, కౌశిక్, రిషిత, ఎల్లో విభాగంలో జయవీర్, సాయి, మణికుమార్‌లు ప్రతిభ కనబర్చారు. విద్యార్థులకు కందాల ప్రమీల, కృష్ణారెడ్డి, ప్రకాశ్‌రావులు సర్టిఫికెట్‌లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జేకేఏఐ జిల్లా జనరల్ సెక్రటరీ అంతటి సోములుగౌడ్, కరాటే శిక్షకులు ఆర్.విజయ్‌కుమార్, శ్రీనివాసాచారి, ఏ అంజి, పవన్‌కళ్యాణ్, పి.సాయికిరణ్ పాల్గొన్నారు.



కట్టంగూర్ : సర్టిఫికెట్లతో విద్యార్థులు

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలపై విచారణ



విచారణ చేస్తున్న శరత్

నాంపల్లి : నాంపల్లి ప్రాథమిక సహకార సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై గురువారం అధికారులు విచారణ నిర్వహించారు. 2023 వేసవి కాలంలో నాంపల్లి ప్రాథమిక సహకార సొసైటీ ఆధ్వర్యంలో రైతుల నుంచి సేకరించిన వరి ధాన్యం తేమ శాతం పేరుతో భారీ కోత విధించారు. దీంతో తమకు రూ.38 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో డీసీఓ ఆదేశాల మేరకు డీసీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శరత్ గురువారం నాంపల్లి ప్రాథమిక సహకార సొసైటీలో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. ఆయన వెంట కార్యాలయం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



మునుగోడు: రత్తిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



గట్టుప్పల మండలం తేరట్‌పల్లిలో..

మునుగోడు: విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధ్యాయులతోపాటు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తే ఉచితంగా పుస్తకాలు, నోట్ పుస్తకాలు, రెండు జతల దుస్తులతోపాటు మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు తెలిపారు.

చండూరు (గట్టుప్పల్) : గట్టుప్పల మండల పరిధిలోని తేరట్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు గురువారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రేణుక, ఉపాధ్యాయులు గోన వెంకటేశ్వరరావు, నరసింహ, రాణి, మల్లేశం, వెంకటేశ్వర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.



మర్రిగూడ : బడిబాట నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు

అంగన్‌వాడీ ఆధ్వర్యంలో బడిబాట

మర్రిగూడ : చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరుతూ మండలంలోని కొండూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ రాకొండ శోభ, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

బస్సెక్కండి.. బహుమతి పొందండి



ప్రయాణికురాలికి బహుమతి అందజేస్తున్న డీఎం

మిర్యాలగూడ టౌన్ : ప్రతి ఒక్కరూ సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులు ఎక్కి బహుమతి పొందాలని మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం జీవీ మహల్ సౌజన్యంతో ×ఆర్టీసీ బస్సెక్కండి–బహుమతి పొందండి৷అనే కార్యక్రమంలో భాగంగా డ్రా తీశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ నుంచి విజయవాడకు వెళ్లే రూట్లలో తమ డీలక్స్ సర్వీసులకు ఆదాయం పెంపు, టార్గెట్ సాధించేందుకు మహిళలను ఆకట్టుకునే విధంగా ఈ కర్యాక్రమాన్ని జీవీ మాల్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ స్కీంను ప్రారంభించినప్పటి నుంచి డీలక్స్ బస్సుకు మంచి స్పందన వస్తుందన్నారు. ఈ డ్రాలో ప్రథమ బహుమతి చిలుకూరు మండల బేతవోలు గ్రామానికి చెందిన భద్రమ్మ, ద్వితీయ బహుమతి నందిగామకు చెందిన పోలి శారద, తృతీయ బహుమతి దామరచర్ల మండల కేంద్రంకు చెందిన లాస్యలు గెలుచుకున్నారన్నారు. ఆర్టీసీ సంస్థను అన్ని విధాలుగా సహకరిస్తున్న ప్రయాణీకులందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ భారతీబాయి, ఎంఎఫ్ పుప్పాల యాదగిరి, జీవీ మహల్ ప్రతినిధులు హరి, సంపత్, సాయి, ఆర్టీసీ సిబ్బంది ఎక్బాల్, పరంగి నాగేశ్వర్‌రావు, జనార్దన్ తదితరులు ఉన్నారు.

రెండు కార్లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన కార్లు

మిర్యాలగూడ అర్బన్: రెండు కార్లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై గురువారం ఉదయం జరిగింది. వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పోట్ల రామారావు తన తమ్ముడు ప్రసాద్‌తో కలిసి వారి సొంతూరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా గురజాలకు కారులో వెళ్తున్నారు. అదే సమయంలో మిర్యాలగూడ మండలం ములకలకాల్వ గ్రామానికి చెందిన పాదిల్ల వేణు కారులో హైదరాబాద్ వైపు వెళ్తుండగా.. మిర్యాలగూడ పట్టణంలోని నార్కట్‌పల్లి–అద్దంకి రహదారి ఫ్లైవర్‌పై అతడి కారు అదుపుతప్పి డివైడర్ మీదుగా అవుతలి వైపు వెళ్లి అటుగా వస్తున్న రామారావు కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసాద్ వెన్నుపూస విరిగిపోగా.. రామారావుకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. రెండు కార్లు ముందుభాగం ధ్వంసమయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో క్షతగాత్రులను మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడు రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనునాయక్ పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో మానవాళి మనుగడ



చౌటుప్పల్ : కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న న్యాయమూర్తి మహతీవైష్ణవి

చౌటుప్పల్ : పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి మహతీవైష్ణవి అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శతకోటి ప్రాణకోటి ఆరోగ్యంగా జీవనం సాగించాలంటే పర్యావరణం బాగుండాలన్నారు. ప్రస్తుతం రోజురోజుకు దెబ్బతింటున్న పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఏమాత్రం ముందుచూపు లేకుండా దశాబ్దాలనాటి చెట్లను నరికివేయడం ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడమే అన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ నరేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్, ప్రతినిధులు తాడూరి పరమేష్, పడమటి మహిపాల్‌రెడ్డి, ఎలమోని శ్రీనివాస్, బాల్యం వెంకటాచలపతి, బడుగు శ్రీకాంత్, ఖయ్యూంపాష, శ్రీశైలం, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

చౌటుప్పల్ : ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ కేంద్రంలోని పైలాన్‌పార్కులో గురువారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందిస్తే మానవాళికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కామిశెట్టి శైలజభాస్కర్, ఎండి.బాబాషరీఫ్, సుల్తాన్ రాజు, కొరగోని లింగస్వామి, మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, స్థానికులు కాసోజు గోవర్దనాచారి, బొడిగె బాలకృష్ణ, గుర్రం వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ హోం.. గ్రీన్ హోం

నల్లగొండ: క్లీన్ హోం.. గ్రీన్ హోం కార్యక్రమంలో భాగంగా గురువారం నల్లగొండలోని న్యూ తిరుమల కాలనీలో పుడమి సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావణాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్రా దామోదర్‌రెడ్డి, చింతపల్లి లింగమయ్య, శ్రీలత, పకీరు శ్రీనివాస్‌రెడ్డి, అలుగుబెల్లి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చౌటుప్పల్ : ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు



నల్లగొండ : మొక్క నాటుతున్న బాల్‌రెడ్డి

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ అర్బన్ : పెండింగ్‌లో ఉన్న ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లు గౌతంరెడ్డి అన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశ వర్కర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ప్రతినెలా రెండో తేదీనే పారితోషికం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం స్పందించి ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఆశ వర్కర్లతో కలిసి రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంటు రామారావు, ఆశ వర్కర్లు పద్మ, కవిత రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడ : ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ కోరారు. ఆశ డే సందర్భంగా గురువారం దామరచర్ల మండల కేంద్రంలోని పీహెచ్‌సీ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశ వర్కర్లలకు నష్టం కలిగించే విధంగా నిర్వహించే పరీక్షను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. సమస్యల పరిష్కారానికై ఈ నెల 13న కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నా కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, ఆశాలు కళావతి, జానకమ్మ, శారద, జయమ్మ, ఇందిరమ్మ, ఉమా శ్రీదేవి, అచ్చాలమ్మ, పద్మ, శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బైరం దయానంద్

నాడు నాటారు.. నేడు నరికారు



మునుగోడు-నల్లగొండ ప్రధాన రహదారి వెంట విద్యుత్ తీగల కింద నరికివేసిన చెట్లు

మునుగోడు: హరితహారంలో భాగంగా ఎనిమిదేళ్లగా విడతలవారీగా మునుగోడు–నల్లగొండ ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. అవి ప్రస్తుతం పెరిగి పెద్దవయ్యాయి. కానీ మొక్కలు నాటే సమయంలో అధికారులకు ముందుచూపు లేకపోవడంతో నేడు వాటిని నరికివేయాల్సిన దుస్థితి నెలకొంది. రోడ్డు వెంట విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడంతో అవి పెరిగి పెద్దవై విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయి. దీంతో వాటిని అడ్డంగా నరికివేస్తున్నారు. అదే మొక్కలు నాటే సమయంలో విద్యుత్ తీగల కింద కాకుండా పక్కకు నాటి ఉంటే నేడు తొలగించే అవసరం ఉండేది కాదు. మునుగోడు–నల్లగొండ ప్రధాన రహదారికి ఓ వైపు దాదాపు కిలో మీటరు దూరం వరకు 60 పెద్దపెద్ద చెట్లను నరికివేయడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ముందుచూపు లేకుండా వ్యవహరించడంతో ప్రజా ధనం వృథా అయ్యిందని మండిపడుతున్నారు.

నేటి నుంచి సాయి ఆలయ వార్షికోత్సవం

కొండమల్లేపల్లి(చింతపల్లి) : చింతపల్లి మండల కేంద్రంలోని సాయి బాబా ఆలయంలో శుక్రవారం నుంచి 17వ వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని ఇప్పటికే సుందరంగా తీర్చిదిద్దారు. ఈ నెల7, 8, 9 తేదీల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయిబాబా ఆలయ వార్షికోత్సవాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.